https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 26 బుధవారం 20-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా? అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను... మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు 9989788438, 9505485656.

## పాలమూరు-రంగారెడ్డి ఈ టర్మ్‌లోనే..

### ప్రాజెక్టు పూర్తి కాకపోవడానికి భూసేకరణే ప్రధాన సమస్య

- భూ సేకరణ పూర్తి కాగానే ప్రాజెక్టు పనులను ప్రారంభించాలి - ఉమ్మడి మహబూబ్‌నగర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్



**హైదరాబాద్, మే 19**
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఈ టర్మ్‌లోనే పూర్తి చేస్తామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నిలిచిపోయిన భూ సేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలందరూ పాలు పంచుకోవాలని, దగ్గరుండి మరీ పూర్తి చేయించాలని నిర్దేశించారు. భూసేకరణ పూర్తి కాగానే పనులు కూడా చేపట్టాలని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్; మక్తల్-నారాయణపేట- కొడంగల్; కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలకు అవసరమైన భూములను సేకరించే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మంగళవారం ఆయన ఎంసీహెచ్‌ఆర్డీలో ప్రాజెక్టులపై సమీక్షించారు. పాలమూరు-రంగారెడ్డికి సంబంధించి నియోజకవర్గాల వారీగా ఉన్న సమస్యలను చర్చించారు. కొల్లాపూర్ నుంచి షాద్‌నగర్ వరకు నీటిని తీసుకెళ్లే ప్రధాన కాల్వలకు భూమిని సేకరించే ప్రక్రియ పెండింగ్‌లో పెట్టడమే ప్రధాన సమస్యగా గుర్తించారు. నియోజకవర్గాల వారీగా ఎక్కడెక్కడ భూమిని సేకరించాలి.. దానికి ఉన్న సమస్యలు ఏంటన్న దానిపై సమీక్ష చేశారు. ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తికాకపోవడానికి భూసేకరణ జరగకపోవడమే ప్రధాన కారణమని, దీన్ని గుర్తించే కాంగ్రెస్ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.5 వేల కోట్లను ప్రత్యేకంగా ప్రాజెక్టుల భూసేకరణకు కేటాయించామని గుర్తు చేశారు. భూ సేకరణపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలు తనకు ఇవ్వాలని నిర్దేశించారు. ఆ సమావేశాలకు ఈఎన్‌సీలనూ పంపిస్తానని చెప్పారు. ప్రాజెక్టుల భూసేకరణను తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుందని, భూ సేకరణకు నిధుల విడుదలలో ఎటువంటి జాప్యమూ ఉండబోదని, పెండింగ్ బిల్లుల చెల్లింపులను కూడా పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. కాంట్రాక్టులపై కాకుండా తొలుత రిజర్వాయర్లు, పంటలకు నీరందించే ప్రధాన కాల్వల భూ సేకరణపై దృష్టి పెట్టి పూర్తి చేస్తే ఆటంకాలు లేకుండా వేగంగా ప్రాజెక్టును పూర్తి చేయవచ్చని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అలాగే, ఈ ప్రాజెక్టుకు 90 టీఎంసీల నికర జలాల కేటాయింపునకు కేంద్రాన్ని ఒప్పించే ప్రక్రియ కూడా కొనసాగుతుందని చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేశామని, కల్వకుర్తి పథకంలోనూ భూసేకరణకు నిధులు ఇచ్చామని తెలిపారు. మక్తల్- కొడంగల్ పథకంలో తొలుత భూములన్నీ సేకరించాకే టెండర్లు పిలిచి... పనులు చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాజేశ్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు మంగళవారం మంత్రి ఉత్తమ్‌తోనూ ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు.

**భూసేకరణపై 25, 26న సమావేశాలు**
సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా భూసేకరణ సమస్యలపై ఈనెల 25, 26 తేదీల్లో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని ఆ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. లోక్‌సభ నియోజక వర్గాల వారీగా వీటిని నిర్వహించనున్నారు. 25న మహబూబ్‌నగర్, 26న నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జరగనున్నాయి. సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ పాల్గొంటారు. జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలు సమావేశాలను నిర్వహించనున్నారు. భూ సేకరణ ప్రక్రియకు సంబంధించి ఈ సమావేశాల్లో పేపర్ వర్క్ పూర్తి చేసుకుని మరోమారు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కానున్నారు.

## కేజ్రీవాల్‌కు కోర్టు ధిక్కార నోటీసులు

### జస్టిస్ మనోజ్ జైన్‌కు ఢిల్లీ మద్యం కేసు విచారణ బాధ్యతలు



**న్యూఢిల్లీ, మే 19:**
ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ సహా మద్యం పాలసీ కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న పలువురు ఆప్ నేతలకు ఢిల్లీ హైకోర్టు మంగళవారం 'నేరపూరిత కోర్టు ధిక్కార' నోటీసులు పంపించింది. ఈ నోటీసులపై 4వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ అంశంపై తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ నవీన్, జస్టిస్ రవీందర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణ కాంతపై ఆప్ నేతలు మాట్లాడిన వీడియోలను భద్రపర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట విచారణకు హాజరు కాబోమని కేజ్రీవాల్, సిసోదియా, దుర్గేశ్ పాఠక్ తదితర ఆప్ నేతలు బహిరంగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వారు ఆమెపై పలు ఆరోపణలు చేశారు. విచారణ జడ్జిపై వారు చేసిన ఈ ఆరోపణలు, చేసిన అవమానకర వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందికి వస్తాయంటూ జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆయా ఆప్ నేతలపై కోర్టు ధిక్కార చర్యలకు ఆదేశించారు. తర్వాత, మద్యం పాలసీ కేసు విచారణ నుంచి తప్పుకున్నారు. కాగా, ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి సీబీఐ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఇక నుంచి జస్టిస్ మనోజ్ జైన్ ధర్మాసనం విచారణ జరపనుంది. ఈ కేసులో విచారణ బెంచ్ మారిన విషయాన్ని కేజ్రీవాల్ సహా ఈ కేసులో నిందితులుగా ఉన్న 23మందికి తెలియజేయాలని జస్టిస్ మనోజ్ జైన్ మంగళవారం సీబీఐని ఆదేశించారు. పిటిషన్‌పై మే 25 విచారణ ప్రారంభిస్తామన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగాలకు..వయో పరిమితి పెంపు


### జనరల్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 34 నుంచి 44 ఏళ్లకు పెంచిన సర్కారు



**హైదరాబాద్, మే 19**
రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం కాస్త ఊరట కల్పించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాల కోసం ఉన్న గరిష్ఠ వయోపరిమితిని పదేళ్లు పెంచింది. గతంలో పెంచిన వయో పరిమితి గడువు ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసిన నేపథ్యంలో... తాజాగా మళ్లీ పెంచుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది పాటు ప్రభుత్వం చేపట్టే ప్రత్యక్ష నియామకాలకు ఈ పెంపు వర్తిస్తుందని తెలిపింది. దీని ప్రకారం జనరల్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెరుగుతుంది. 'తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్'లోని 12వ నిబంధన ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 5 ఏళ్లు, దివ్యాంగులకు పదేళ్లు వయోపరిమితి సడలింపు ఉంటుంది. ఈ మేరకు ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లు గరిష్ఠ వయో పరిమితి వర్తిస్తుంది. పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక, జైళ్లు, అటవీ శాఖ తదితర యూనిఫాం సర్వీసుల్లోని ఉద్యోగాలకు ఈ వయోపరిమితి పెంపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 8న వయోపరిమితిని పెంచింది. ఆ గడువు ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది.

## మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

ఐదు రోజుల్లోనే రెండోసారి..
లీటరు పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసల పెంపు



**న్యూఢిల్లీ, మే 19:**
దేశంలో మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. పెట్రోల్‌పై లీటరుకు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెంచుతున్నట్టు పెట్రోలియం సంస్థలు మంగళవారం ప్రకటించాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో పెట్రోల్ రేట్లు పెంచబోమన్న ప్రభుత్వం.. అందుకు విరుద్ధంగా ఐదు రోజుల్లోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. ఈ నెల 15వ తేదీన పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంచగా, తాజాగా మరో 90పైసల వరకు పెంచారు. దీనితో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.111.88కి డీజిల్ ధర రూ.99.89కి చేరాయి. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు, ప్రాంతాల్లో స్థానిక పన్నుల ఆధారంగా, వేర్వేరు కంపెనీల బంకుల్లో రవాణా వ్యయం ఆధారంగా ఈ పెంపులో కాస్త హెచ్చుతగ్గులు ఉంటాయి. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ రూ.98.64, డీజిల్ రూ.91.58కి చేరాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదనే సంకేతాలు వెలువడ్డాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారీ స్థాయిలో నష్టాలు వస్తున్నాయని పెట్రోలియం కంపెనీలు పేర్కొన్నాయి.

## బోటు మనదివేట మనది!

- కాదని ఎవరైనా వస్తే ఖబడ్దార్: సీఎం - హద్దుదాటి రావద్దని హెచ్చరిస్తున్నా
- 'మత్స్యకారుల సేవలో..' సభలో సీఎం వ్యాఖ్యలు - టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు..వారికి రుణపడ్డాం



**నెల్లూరు, మే 19**
రాష్ట్రంలోని మత్స్యకారుల జీవితాలను ఉన్నతస్థితికి చేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "ఈ తీరం మనది. బోటు మనది. వేట మనది. కాదని పక్క రాష్ట్రాల బోట్లు మన సముద్ర జలాల్లోకి ప్రవేశిస్తే వదిలే ప్రసక్తే లేదు. వెంటాడుతాం.. వేటాడుతాం.. ఇందులో రాజీ లేదు. ఇది సీబీఎన్ మాట." అని ఆయన వ్యాఖ్యానించారు. గొడ్డలి పార్టీ చేసే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని కోరారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గ పరిధిలోని తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం జరిగిన 'మత్స్యకార సేవలో' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. వేట విరామ భృతి కింద ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు చొప్పున రాష్ట్రంలోని 1,30,796 కుటుంబాలకు రూ.261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు. "రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మత్స్యకార కుటుంబాలున్నాయి. తరతరాలుగా బతుకు తెరువు కోసం ప్రాణాలకు తెగించి సముద్ర వేటతో జీవనం సాగిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ వర్గాలను, వారి కష్టాలను తొలిసారిగా గుర్తించిన నాయకుడు ఎన్టీఆర్. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15వరకు వేట విరామ సమయంలో మత్స్యకారుల జీవనోపాధి కోసం సాయాన్ని ప్రవేశపెట్టిన తొలి ప్రభుత్వం తెలుగుదేశం. తొలుత 31 కిలోల బియ్యం ఇచ్చాం. తుఫాను సమయాల్లో 50 కేజీల చొప్పున బియ్యం అందజేశాం. వేట విరామ సమయంలో జీవన భృతి కోసం 2014-15లో తొలిసారి రూ.2వేలు ఇచ్చాం. ఆ తరువాత దానిని పది వేలకు పెంచాను. ఇప్పుడు రూ.20వేలకు పెంచాను. మోటారు బోట్లకు సబ్సిడీ ధరకు డీజిల్ ఇస్తున్నాం. ఈ బడ్జెట్‌లో డీజిల్ సబ్సిడీ కింద 50 కోట్లు విడుదల చేశాం. మత్స్యకారుల సంక్షేమంలో భాగంగా 3,256కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేశాం" అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

**60 శాతం సబ్సిడీతో 200 మెకనైజ్డ్ బోట్లు**
"మెకనైజ్డ్ బోట్లు ఇస్తే అభివృద్ధి చెందుతామని మత్స్యకారులు అడిగారు. వారి కోరిక మేరకు 200 మెకనైజ్డ్ బోట్లు మంజూరు చేస్తున్నాం. వాటిని 60 శాతం సబ్సిడీతో ఇస్తాం. తక్కిన 40శాతం బ్యాంక్ రుణంగా ఇప్పిస్తాం. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చేపల లభ్యత, రక్షణపరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు చర్యలు తీసుకొంటున్నాం. మత్స్యకారుల రక్షణ కోసం 4,550 ట్రాన్స్‌పాండర్లను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులపై వారికి సమాచారం అందిస్తున్నాం. కావలి ఫిషింగ్ హార్బర్‌లో స్థాపించనున్న సాగర్ డిఫెన్స్ సంస్థ ద్వారా డ్రోన్ల పర్యవేక్షణలో ఎక్కడ చేపలు ఎక్కువగా ఉన్నాయో కూడా సమాచారం తెలుస్తుంది. మత్స్యకార కుటుంబాలకు చెందిన ఆడపడుచుల ద్వారా సముద్ర నాచు పెంపకాన్ని ప్రారంభిస్తాం. త్వరలోనే ఆ ఆర్థిక విప్లవాన్ని చూస్తారు. చేపల ఎగుమతుల్లో దేశం వాటా 28శాతంగా ఉంటే, అందులో ఏపీ వాటా 38 శాతం. రొయ్యల ఎగుమతుల్లో 80శాతం ఉత్పత్తులు రాష్ట్రంనుంచే ఉన్నాయి."

## వీధి కుక్కల దాడులకు జంతు ప్రేమికులు బాధ్యత వహిస్తారా?

**న్యూఢిల్లీ, మే 19:** వీధికుక్కల వల్ల సామాన్య ప్రజలకు గాయాలైనా, హాని లేదా నష్టం జరిగితే.. దానికి సంబంధించిన న్యాయపరమైన బాధ్యతను తీసుకునేందుకు జంతుప్రేమికులు, జంతు సంక్షేమ సంస్థలు, ఎన్జీవోలు సిద్ధమేనా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. బహిరంగ ప్రదేశాల్లో ఉండే వీధి కుక్కలను రక్షించే హక్కు తమకుందని ఎవరైనా వాదిస్తే.. తమ చర్యల వల్ల ఇతరులకు ఎలాంటి హానీ జరగకుండా చూడాల్సిన బాధ్యత నుంచి వారు వేరుపడలేరని స్పష్టం చేసింది. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండే వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలంటూ గతంలో ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను తోసిపుచ్చుతూ.. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం మంగళవారం 131 పేజీల తీర్పునిచ్చింది. వీధి కుక్కల భయం లేకుండా స్వేచ్ఛగా తిరగగలగడం అనేది ప్రజలు గౌరవంగా జీవించే హక్కు కిందికి వస్తుందని అందులో స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఎంతోమంది పిల్లలు, వృద్ధులు అంతర్జాతీయ పర్యాటకులు కుక్కకాటుకు గురవుతున్నారని.. కఠినమైన ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను తాము విస్మరించలేమని పేర్కొంది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు వాటిని జనసమ్మర్థ ప్రదేశాల నుంచి షెల్టర్లకు తరలించాలంటూ సుప్రీంకోర్టు గత ఏడాది నవంబరు 7న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.

# మాజీ సీఎం ఖండూరి మృతిపై ఉపరాష్ట్రపతి దిగ్భ్రాంతి

**దేశం గొప్ప సైనికుడు, నిజాయితీ నాయకుడిని కోల్పోయిందన్న వ్యాఖ్య**



**డెహ్రాడూన్, 19 మే**
ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి మేజర్ జనరల్ బి.సి. ఖండూరి మృతి పట్ల భారత ఉపరాష్ట్రపతి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం ఒక గొప్ప సైనికుడిని, సమర్థవంతమైన పరిపాలకుడిని, అరుదైన నిజాయితీ గల నాయకుడిని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖండూరి మరణం దేశ రాజకీయ, పరిపాలనా రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమ వేదికలో స్పందించిన ఉపరాష్ట్రపతి, ఖండూరి సేవలను ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల రంగంలో ఆయన పాత్ర దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. దేశ రహదారి వ్యవస్థను ఆధునీకరించడంలో ఖండూరి పాత్ర కీలకమని ఉపరాష్ట్రపతి గుర్తు చేశారు. గోల్డెన్ క్వాడ్రిలేటరల్ ప్రాజెక్టు, జాతీయ రహదారుల అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, అమలులో ఆయన దూరదృష్టి దేశ అభివృద్ధికి పునాది వేసిందని కొనియాడారు. దేశ రవాణా వ్యవస్థను కొత్త దిశగా తీసుకెళ్లడంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదని అభిప్రాయపడ్డారు. ఇటీవల డెహ్రాడూన్ పర్యటనలో ఖండూరిని కలిసిన విషయాన్ని కూడా ఉపరాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు. లోక్‌సభలో కలిసి పనిచేసిన రోజుల జ్ఞాపకాలను ఆ సమయంలో పంచుకున్నామని తెలిపారు. ఆ సమావేశం తనకు ఎంతో ప్రత్యేకంగా నిలిచిందని పేర్కొన్నారు. మేజర్ జనరల్ బి.సి. ఖండూరి రాజకీయ నాయకుడిగానే కాకుండా సైనికుడిగా కూడా దేశానికి విశేష సేవలు అందించారు. ప్రజా జీవనంలో పారదర్శకత, నిజాయితీకి ఆయన ప్రతీకగా నిలిచారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఉత్తరాఖండ్ అభివృద్ధిలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేస్తున్నారు. ఈ దుఃఖ సమయంలో ఖండూరి కుటుంబ సభ్యులకు, ఆయన అభిమానులకు, ఉత్తరాఖండ్ ప్రజలకు ఉపరాష్ట్రపతి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆశయాలు, సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# మోదీ పర్యటనలపై రాహుల్ విమర్శలు

**ఆర్థిక సంక్షోభం వేళ విదేశీ పర్యటనలపై ప్రశ్నలు**
**దేశానికి ఆర్థిక తుపాను ముప్పు ఉందంటూ హెచ్చరిక**
**ప్రభుత్వ ఆర్థిక విధానాలపై తీవ్ర విమర్శలు**



**రాయ్‌బరేలీ, 19 మే**
దేశ ఆర్థిక పరిస్థితులు, ప్రధాని విదేశీ పర్యటనల అంశం రాజకీయంగా మరోసారి చర్చనీయాంశమైంది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీ పర్యటనలో భాగంగా చురువా హనుమాన్ ఆలయాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, దేశం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ప్రధాని విదేశాల్లో పర్యటించడం సరైందేనా అని ప్రశ్నించారు. దేశంలో సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రధాని సూచించిన విషయాన్ని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. ప్రజలకు విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, పొదుపు చర్యలు పాటించాలని సూచిస్తున్న ప్రధాని స్వయంగా విదేశీ పర్యటనల్లో బిజీగా ఉండటం విరుద్ధంగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఒకవైపు ప్రజలకు సూచనలు, మరోవైపు విదేశీ పర్యటనలు కొనసాగడం ప్రశ్నలు లేవనెత్తుతోందని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఈ సంక్షోభం ప్రభావం సాధారణ ప్రజలు, యువతపై తీవ్రంగా ఉండబోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పెద్ద వ్యాపారవేత్తలు, ధనవంతులు మాత్రం ఈ పరిస్థితుల ప్రభావం నుంచి సురక్షితంగా బయటపడే అవకాశముందని వ్యాఖ్యానించారు. దేశంలో ఇంతకుముందు చూడని ఆర్థిక తుపాను రాబోతోందని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం అమలవుతున్న ఆర్థిక విధానాలే భవిష్యత్ సమస్యలకు కారణమవుతాయని ఆరోపించారు. ప్రజల అవసరాలు, ఉద్యోగాలు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విధానాలు ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతం ఐదు దేశాల దౌత్య పర్యటనలో ఉన్నారు. ఇప్పటికే పలు యూరోపియన్ దేశాల పర్యటనలు పూర్తి చేసిన ఆయన మంగళవారం ఇటలీ పర్యటనకు వెళ్లనున్నట్లు సమాచారం. విదేశాంగ సంబంధాల బలోపేతం, వ్యూహాత్మక అంశాలపై ఈ పర్యటనలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని ఇటీవల సూచించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన తాజా విమర్శలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే ఈ విమర్శలపై అధికార పార్టీ స్పందన రావాల్సి ఉంది.

# ప్రజావాణిపై చిన్నారెడ్డి వ్యాఖ్యలు

**- ఆదిలాబాద్ ప్రజావాణి నివేదిక ఆవిష్కరణ**
**- ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని సూచన**



**హైదరాబాద్, 19 మే**
ప్రగతిశీల భావజాలంతో ప్రజా సమస్యలను అర్థం చేసుకుంటే వాటి పరిష్కారానికి మార్గం సులభమవుతుందని సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ. చిన్నారెడ్డి పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో ఆదిలాబాద్ జిల్లా ప్రజావాణి అమలు తీరుపై రూపొందించిన పైలెట్ ప్రాజెక్టు నివేదికను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌తో కలిసి నివేదికను విడుదల చేశారు. ప్రజావాణి ద్వారా ప్రజలు వివిధ సమస్యలతో వస్తున్నారని, వారి సమస్యలను అధికారులు సానుకూల దృక్పథంతో వినాలని సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కారమైతే వారి ముఖాల్లో కనిపించే సంతృప్తి ఎంతో విలువైనదని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజయవంతంగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే డివిజన్ స్థాయికి విస్తరించిందని తెలిపారు. భవిష్యత్తులో మండల స్థాయిలో కూడా ప్రజావాణిని అమలు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా వ్యవస్థను విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును ఓపికతో విని పరిష్కరించే ప్రయత్నం జరుగుతోందని చిన్నారెడ్డి చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి చేరుతున్నాయని అధికారులు తెలిపారు. సమస్యల పరిష్కారంలో వేగం పెంచి మరింత సమర్థవంతంగా కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజావాణి అధికారులు, నిర్వాహకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి మరింత కీలక వేదికగా మారుతోందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# రెరా చైర్మన్ రాజీనామా

**స్వచ్ఛందంగా వైదొలిగేందుకు గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి**
**మూడేళ్ల పదవీకాలంలో రియల్ ఎస్టేట్ రంగంలో పలు సంస్కరణలు**



**హైదరాబాద్, మే 19**
'తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ' (టీజీ రెరా) చైర్మన్ ఎన్ సత్యనారాయణ పదవికి రాజీనామా చేశారు. స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించడంతో మంగళవారం రాజీనామా చేశారు.
ఈ పరిణామం రియల్ ఎస్టేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2023 జూన్‌లో టీజీ రెరా చైర్మన్‌గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల పదవీకాలంలో ఆయన పలు సంస్కరణలు తీసుకొచ్చారు. పారదర్శకతకు, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చారు. బిల్డర్లకు వారి బాధ్యతలను తెలియజేయడం, కొనుగోలుదారులకు భరోసా కల్పించటం తన విధుల్లో భాగమని పలు సందర్భాల్లో చెప్పారు. అనుమతి లేని వెంచర్లు, తప్పుడు ప్రకటనలపై కఠినంగా వ్యవహరించారు. రెరా రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేశారు. కొనుగోలుదారులు మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేశారు. సత్యనారాయణ పదవి నుంచి తప్పుకోవడంతో, ఆయనతోపాటు రాజీనామా చేసేందుకు రెరాలో మరికొందరు సిద్ధపడుతున్నారు. ఈ పరిణామం రెరాలో చర్చనీయాంశంగా మారింది.

# ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

**- జూన్ రెండున ఘనంగా రాష్ట్ర వేడుకలు**
**- పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహణకు అధికారులకు ఆదేశాలు**
**- శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచన**



**హైదరాబాద్, 19 మే :**
జూన్ రెండో తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్‌పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. పరేడ్ గ్రౌండ్, గన్‌పార్క్ వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖ నుంచి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రముఖుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్స్‌కు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వాటర్‌ప్రూఫ్ షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. సభా ప్రాంగణంలో పారిశుధ్య పనులు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం కనిపించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అసెంబ్లీ, సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్‌తో పాటు ముఖ్య ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. వేడుకలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖకు సూచించారు. ఈ నెల ఇరవై ఐదో తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్స్‌లో అన్ని శాఖలు సంయుక్తంగా రిహార్సల్స్ నిర్వహించాలని వికాస్ రాజ్ స్పష్టం చేశారు.

# జలమండలి జీఎం రూ.100 కోట్లు

**ఇంట్లో కరెన్సీ నోట్ల గుట్టలు.. 2.1 కిలోల బంగారం, 9.2 కిలోల వెండి**
**సంగారెడ్డి. నిజామాబాద్‌లో 18 ఎకరాల వ్యవసాయ భూమి**



**హైదరాబాద్, తార్నాక, మే 19:**
రెండు కిలోల బంగారం, తొమ్మిది కిలోల వెండి.. గుట్టలుగా నోట్ల కట్టలు.. విలాసవంతమైన ఇల్లు, ఖరీదైన ఫ్లాట్లు, ఎకరాల కొద్దీ పొలాలు.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) రెడ్ హిల్స్ డివిజన్‌లో జనరల్ మేనేజర్ ఎస్. అనంత లక్ష్మీకుమార్ అక్రమాస్తుల చిట్టా ఇది. ఇంతేనా.. అపార్ట్‌మెంట్‌లకు ఒక్కో వాటర్ ట్యాంకర్‌ను రూ.5,000 చొప్పున అక్రమంగా విక్రయిస్తూ ప్రతి రోజు రూ.50,000 మేర వసూళ్లు.. అనంత లక్ష్మీ కుమార్ తన పదవిని అడ్డుపెట్టుకొని ఇలా ఏకంగా రూ.100 కోట్లకుపైగా విలువైన ఆస్తులు కూడబెట్టారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు ఓ ప్రకటన చేశారు. అనంత లక్ష్మీకుమార్ వ్యవహారంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు చేశారు. హైదరాబాద్‌లోని లక్ష్మీకుమార్ ఇల్లు, కార్యాలయంతోపాటు ఏకకాలంలో ఎనిమిది చోట్ల ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. మంగళవారం రాత్రి కూడా సోదాలు కొనసాగుతున్నాయి. మల్లాపూర్‌లోని అనంత లక్ష్మీ కుమార్ నివాసం, అతని మిత్రులు, బినామీల ఇళ్లల్లో చేసిన సోదాలు చేశారు. ఈ తనిఖీలో భారీగా కరెన్సీ నోట్ల కట్టలు బయటపడగా.. నగదును లెక్కించడం కోసం ఏకంగా కరెన్సీ లెక్కింపు యంత్రాలను తెప్పించారు. ప్రాథమిక సమాచారం మేరకు లక్ష్మీ కుమార్ దాదాపు రూ.100కోట్లకు పైగా ఆస్తులను సంపాదించినట్లు వెల్లడైంది. మల్లాపూర్‌లోని లక్ష్మీకుమార్ ఇంట్లో దాదాపు రూ1.10 కోట్ల నగదు, 2.1కిలోల బంగారు ఆభరణాలు, 9.2 కిలోల వెండి వస్తువులను ఏసీబీ అధికారులు గుర్తించారు. అలాగే, లక్ష్మీ కుమార్ భార్య పేరిట ఉన్న బ్యాంకు లాకర్లను గుర్తించిన అధికారులు.. ఆమెను బ్యాంకుకు తీసుకెళ్లి వాటిని తెరిపించారు. ఆ లాకర్లలోని విలువైన ఆస్తుల పత్రాలు, కొన్ని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అనంత లక్ష్మీ కుమార్ హైదరాబాద్‌లోని ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్టుల్లో మూడు ఫ్లాట్లు, ఆరు ఇళ్ల స్థలాలు, ఒక విలాసవంతమైన ఇల్లు, నిజామాబాద్, సంగారెడ్డిలో 18ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

# గంజాయి రహిత సమాజం కోసం అక్కన్నపేట పోలీస్ ప్రత్యేక దాడులు

**- నార్కోటిక్ డాగ్స్ తో విస్తృత తనిఖీలు - ఎస్పై చాతరాజు ప్రశాంత్**



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పై ప్రశాంత్



నార్కోటిక్ డాగ్స్ తో తనిఖీ చేస్తున్న దృశ్యం

**హుస్నాబాద్(అక్కన్నపేట),మే19**
అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ఎస్సై చాతరాజు ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మంగళవారం రోజున చర్యలు చేపట్టారు. గౌరవెల్లి గోవర్ధనగిరి గ్రామాలలో నార్కోటిక్ డాగ్స్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కిరాణా షాపులు టీ కొట్టులు పాన్ షాపులు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి మత్తు పదార్థాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీసులు నిరంతరం చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు, మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు ఎవరైనా కలిగి ఉన్నా అక్రమంగా రవాణా చేసినా లేదా విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే గంజాయి రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్న ఆయన మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 లేదా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు సమాచారం అందించాలని సూచించారు.

గ్రామాల్లో నిర్వహించిన ఈ తనిఖీలు ప్రజల్లో అవగాహన పెంచడమే కాకుండా మత్తు పదార్థాల అక్రమ రవాణాపై కఠిన చర్యలకు ఉపక్రమించడం ఖాయమనే భావన ప్రజల్లో కలుగజేసింది.

# బలహీన వర్గాల గొంతుక వీహెచ్

**ప్రభుత్వ సలహాదారు కావడం హర్షణీయం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**కాంగ్రెస్‌కు విధేయుడు వీహెచ్: మంత్రి దుద్దిళ్ల**

**రవీంద్రభారతిలో వీహెచ్‌కు ఆత్మీయ సత్కారం**

**రవీంద్రభారతి, మే 19**
బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆరు దశాబ్దాలుగా కృషి చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు (వీహెచ్) సేవలు అభినందనీయమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. రాజకీయాల్లో ఎంత ఎదిగినా, ఒదిగి ఉండాలనే సిద్ధాంతాన్ని పాటించిన నాయకుడని కొనియాడారు. రవీంద్రభారతిలో మంగళవారం ఆదర్శ ఫౌండేషన్, శృతిలయం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావును ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ బలహీన వర్గాల గొంతుక అయిన హనుమంతరావు.. క్యాబినెట్ హోదాలో ప్రభుత్వ సలహాదారుగా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. 50ఏళ్లుపైగా కాంగ్రెస్‌లో కొనసాగడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వి.హనుమంతరావుకు ప్రభుత్వ సలహాదారు పదవి దక్కడం హర్షణీయమన్నారు. తప్పును తప్పు అనడంలో హనుమంతరావు ముందుంటారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడని అభివర్ణించారు.



ఇకముందు కూడా ఓబీసీల వెంట ఉండాలని, ఎలాంటి సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న హనుమంతరావును సత్కరించుకోవడం అభినందనీయమన్నారు. సన్మానగ్రహీత వి.హనుమంత రావు మాట్లాడుతూ ఆత్మీయ సత్కారం చేసిన మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవ చేయాలన్న లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. అట్టడువర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నానన్నారు.

# కాక్రోచ్ జనతా పార్టీ!

**నిరుద్యోగులు బొద్దింకల్లా మారారన్న సీజేఐ వ్యాఖ్యల నేపథ్యంలో కొత్త పార్టీ**

**రెండ్రోజుల్లోనే 40 వేల మంది సభ్యులు**




**న్యూఢిల్లీ, మే 19:**
దేశంలో ఇప్పటికే అనేకానేక రాజకీయపార్టీలున్నాయి. కానీ, ఏ పార్టీ కూడా బొద్దింకను పేరుగా పెట్టుకొని ఉండదు. తాజాగా, ఓ 30 ఏళ్ల యువకుడు అభిజీత్ దీప్కే ఈ పని చేశాడు. 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) పేరుతో పార్టీని స్థాపించాడు. 'సెక్యులర్, సోషలిస్ట్, డెమోక్రటిక్, లేజీ (సోమరితనం)' తమ నినాదమని ప్రకటించాడు. అంతా వింతగా ఉందని అనుకుంటున్నారా? నిజమే.. ఇది దేశంలోని పరిణామాలపై ఓ వ్యంగ్య బాణం. నిరుద్యోగులు సోమరిపోతుల్లా, బొద్దింకల్లా తయారై జర్నలిస్టులు, న్యాయవాదులు, సమాచార హక్కు కార్యకర్తల పేరుతో వ్యవస్థ మీద దాడి చేస్తున్నారంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. తన వ్యాఖ్యలను వక్రీకరించారని సీజేఐ పేర్కొన్నారు. అయినప్పటికీ, ఆ వ్యాఖ్యల మీద సోషల్ మీడియాలో రకరకాల వ్యాఖ్యానాలు నడుస్తున్నాయి. దీంట్లో భాగంగానే అభిజీత్ దీప్కే.. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని స్థాపించినట్లుగా సోషల్ మీడియాలో ఈ నెల 16వ తేదీన ప్రకటించారు. పార్టీ యువత కోసం పని చేస్తుందని, ప్రజల సొమ్ము ఎటు పోతుందో నిలదీయటానికి పార్టీ పెట్టామని తెలిపారు. దీంట్లో చేరటానికి అర్హతలు.. నిరుద్యోగం, సోమరితనం (భౌతికంగానే.. మానసికంగా కాదు), ఆన్‌లైన్‌కు (ఫోన్‌కు, సోషల్ మీడియాకు) అతుక్కొని ఉండటం, వ్యవస్థపై ఆగ్రహాన్ని అద్భుతంగా వెళ్లగక్కే నైపుణ్యం కలిగి ఉండటం అని పేర్కొన్నారు. ఎక్స్‌లో సీజేపీ గురించి ప్రకటించగానే అనూహ్య స్పందన వచ్చింది. కేవలం 48 గంటల్లో 40 వేల మందికిపైగా సభ్యులుగా చేరారు. లోక్‌సభలో అధికారపక్షం మీద నిప్పులు కురిపించే తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా తన అర్హతల గురించి ప్రస్తావిస్తూ.. 'నాకు యాంటీ నేషనల్ పార్టీ సభ్యత్వం ఉంది. మీతో కలిసి పని చేయవచ్చా?' అని ప్రశ్నించారు. యాంటీ నేషనల్ అంటూ బీజేపీ మద్దతుదారులు తన మీద చేసే ఆరోపణలను వ్యంగ్యంగా తిప్పికొడుతూ ఆమె ఇలా స్పందించారు. దీనికి సీజేపీ బదులిస్తూ.. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడే యోధురాలైన మీకు స్వాగతం' అంటూ జవాబిచ్చింది. అలాగే, తృణమూల్‌కే చెందిన మరో ఎంపీ, మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్.. సీజేపీలో చేరటానికి అర్హతలేమిటి అని ప్రశ్నించగా.. '1983 క్రికెట్ వరల్డ్ కప్‌ను గెల్చుకోవటానికి మించిన అర్హత ఏముంటుంది?' అని సమాధానమిచ్చింది. సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్ సీజేపీ అజెండాకు కొన్ని అదనపు అంశాలను సూచించారు. సమాచారహక్కు చట్టం కింద ప్రజలకు పార్టీ జవాబుదారీగా ఉండాలి, ఎలక్టోరల్ బాండ్స్‌తోసహా అజ్ఞాతవ్యక్తులు ఇచ్చే విరాళాల్ని స్వీకరించరాదు, ఏనాటికి కూడా రహస్య కాక్రోచ్ కేర్స్ ఫండ్‌ను ప్రారంభించవద్దు (పీఎం కేర్స్‌ను పరోక్షంగా ఉద్దేశించి) అని పేర్కొన్నారు. వీటికి సీజేపీ మద్దతు తెలపటమే కాదు.. తమ మేనిఫెస్టోలో భాగం చేస్తున్నామని పేర్కొంది. తమను ఈ రకంగా మునివేళ్ల మీద నిలబెట్టటమే తమకు కావాలని తెలిపింది. ఈ విధంగా ఉనికిలోకి రావటంతోనే సంచలనంగా మారిన సీజేపీ నిజంగానే రాజకీయ పార్టీగా మారుతుందా? అన్నది ప్రస్తుతానికి తెలియదు. కాకపోతే, ఎలా పని చేయాలి అన్నదానిపై త్వరలో ఆన్‌లైన్ సదస్సు నిర్వహిస్తామని అభిజీత్ దీప్కే ప్రకటించారు.

**ఐదు అంశాలతో మేనిఫెస్టో**
తాము అధికారంలోకి వస్తే చేపట్టే పనుల పేరుతో సీజేపీ ఐదు అంశాలతో మేనిఫెస్టోను ప్రకటించింది. అవి 1. పదవీ విరమణ చేసే ఏ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా రాజ్యసభ సభ్యత్వాన్ని కానుకగా ఇవ్వబోము 2. నిజమైన ఏ ఒక్క ఓటరు ఓటు హక్కు కోల్పోయినా దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఉపా చట్టం కింద అరెస్టు చేసి విచారణ జరుపుతాం. ఓటింగ్ హక్కుల నిరాకరణ ఉగ్రవాదానికి ఏమాత్రం తక్కువ కాదు. 3. పార్లమెంటు సీట్ల సంఖ్యను పెంచకుండానే సగం సీట్లను మహిళలకు కేటాయిస్తాం. కేంద్ర క్యాబినెట్‌లో సగం పదవులు మహిళలకు ఇస్తాం 4. అదానీ, అంబానీలకు చెందిన అన్ని మీడియా సంస్థల లైసెన్సులు రద్దు చేస్తాం. గోదీ మీడియా యాంకర్ల బ్యాంకు ఖాతాలపై దర్యాప్తు జరిపిస్తాం. దేశంలో నిజమైన స్వతంత్ర మీడియా పని చేయటానికి దారులు వేస్తాం. 5. పార్టీ ఫిరాయించే ఎంపీ, ఎమ్మెల్యేల మీద 20 ఏళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధిస్తాం.

## అల్వాల్ భూముల వ్యవహారంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల సస్పెన్షన్



**హైదరాబాద్, మే 19**
మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్ పరిధిలో సర్వే నం. 582, 583లకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లపై సస్పెన్షన్ వేటు పడింది. నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న భూములను రికార్డులు పరిశీలించకుండా క్వారీ కార్మికుల పేరుతో వంద గజాల చొప్పున రిజిస్ట్రేషన్ చేసినట్లు విచారణలో తేలింది. ఇదే విషయంపై ఇటీవల ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌ల శాఖ మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను సస్పెండ్ చేయాలని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతును ఆదేశించారు. అక్రమాలు నిజమని తేలడంతో వల్లభనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే సమయంలో అవకతవకలకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్ టి.శృతి, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ ఆర్. సత?షను సస్పెండ్ చేశారు. మేడె ?చల్ జిల్లా రిజిస్ట్రార్ ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వైద్యకళాశాలలకు అధ్యాపకుల కళ!

**433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల**



**హైదరాబాద్, మే 19**
ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన మెరిట్ జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళ వారం విడుదల చేసింది. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పునఅభ్యర్థు లను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఆహ్వానించింది. హైదరాబాద్‌లోని వెంగళ్‌రావు నగర్‌లో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రాంగణంలో ఈ నెల 22, 23 తేదీల్లో వెరిఫికేషన్ జరగనుందని, అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని బోర్డు పేర్కొంది. ఈ తేదీల్లో రాలేకపోయిన వారు, 25న వచ్చి సర్టిఫికెట్లు అందజేయవచ్చని స్పష్టం చేసింది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయగా.. పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, అనెస్తీషియా విభాగాల్లోని 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయింది. మిగిలిన 30 డిపార్ట్‌మెంట్లలోని 433 పోస్టులకు సంబంధించి.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం తుది జాబితా విడుదల చేస్తామని బోర్డు తెలిపింది. బుధవారం మెడికల్ షాపుల బంద్‌కు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపునిచ్చిన నేపథ్యంలో.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు సహా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 గంటలపాటు ఫార్మసీలు తెరిచి ఉంచాలని, ఫార్మసిస్టులందరూ అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

## అక్రమంగా తరలిస్తున్న కంకర లారీల పట్టివేత



**మన సమాజం/చెన్నూరు:**
వరంగల్ నుండి చెన్నూరుకు అక్రమంగా తరలిస్తున్న 3కంకర లారీలను మైనింగ్ సిబ్బంది పట్టుకున్నారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేవనే పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని, ప్రభుత్వ ఆధాయానికి గండి కొట్టేందుకు ఇలాంటి తప్పుడు చర్యలకు పాల్పడితే ఉపేక్షించ బోమని, నియోజకవర్గంలో జీరో దందాపై తమ నిఘా ఉంటుందని మైని ంగ్ సిబ్బంది పేర్కొన్నారు. తదుపరి చర్యలకు మైనింగ్ ఏడి జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం చెన్నూరు పోలీసులకు లారీలను అప్పగించామని వారు తెలిపారు.

## ఆ హక్కు బీఆర్ఎస్‌కు లేదు

**హైదరాబాద్, మే 19** పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి పాదయాత్ర చేసే నైతిక హక్కు మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ మాజీ మంత్రులకు లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రాజెక్టుల పేరుతో రూ.వేల కోట్లు దోచుకున్నవాళ్లు ఇప్పుడు చిలక పలుకులు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి తదితరులతో కలిసి మంత్రి జూపల్లి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి పంపులు, మోటార్లు, సర్జ్‌పూల్‌కు రూ.35 వేల కోట్లు కేటాయించి.. కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు.




మా ఇంటి వీడియోలు సీక్రెట్‌గా

# తీస్తే ఊరుకోను

## అలియా భట్ వార్నింగ్

తన కొత్త ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంపై సీరియస్ అయ్యింది బాలీవుడ్ నటి ఆలియా భట్. ఈ విషయంపై తన అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఇలాంటి పనులు తమ గోపత్యకు భంగం కలిగించడమే కాకుండా.. భద్రత సమస్యలను సృష్టిస్తాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టింది. ఇటీవలే ఆలియాభట్ – రణ్‌బీర్ కపూర్ జంట కలిసి ముంబైలో కొత్తగా ఒక ఇల్లు కట్టుకుంటుంది. ఈ ఇల్లు దాదాపు రూ.250 కోట్లతో నిర్మిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ భవనంకి సంబంధించిన వీడియోలు ఎవరో సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీంతో పలు న్యూస్ ఛానల్స్ కూడా ఆ విజువల్స్‌ని ప్రచురించాయి. అయితే ఈ విషయంపై సీరియస్ అయిన ఆలియా సోషల్ మీడియా వేదికగా స్పందించింది. ”ముంబై వంటి మహానగరంలో నివాసాలు చాలా దగ్గరిగా ఉండటం వలన ఒకరి ఇంటి నుంచి మరొకరి ఇంటిని చూడడం సహజమే. కానీ ఇలా ఉండడం వలన ప్రైవేట్ ఇళ్లను వీడియోలు తీసి ఆన్‌లైన్‌లో పెట్టే హక్కు ఎవరికీ లేదు. అనుమతి లేకుండా ఒకరి ప్రైవేట్ స్థలాలను వీడియోలు తీయడం అనేది కేవలం 'కంటెంట్' కాదు, అది ఒకరి గోప్యతను ఉల్లంఘించడమే అని ఆలియా భట్ తెలిపారు. అలాగే ఈ ఘటనపై ఆలియా తన భాదను వ్యక్తం చేస్తూ.. మీడియా సంస్థలకు, తన అభిమానులకు ఒక విజ్ఞప్తి చేసింది. మీ ఇంటిలోపల నుంచి వీడియోలు తీసి మీకు తెలియకుండా బయటపెడితే మీరు ఒప్పుకుంటారా? మనలో ఎవరూ ఒప్పుకోరు కదా అంటూ ఆలియా అభిమానులను ప్రశ్నించింది. అలాగే తన ఇంటి వీడియోలు ఫోటోలు ఆన్‌లైన్‌లో కనిపిస్తే దయచేసి వాటిని ఫార్వార్డ్ చేయొద్దని, షేర్ చేయొద్దని అభిమానులను కోరింది. మరోవైపు తన ఇంటి వీడియోలను ప్రచూరించిన మీడియా సంస్థలు వెంటనే వాటిని తొలగించాలని విజ్ఞప్తి చేసింది.

# గ్రామీణ నేపథ్యంలో హైలెస్సో



సుడిగాలి సుధీర్‌గా పేరుపొందిన సుధీర్ ఆనంద్ కథానాయకుడిగా రూపొందు తున్న ఎమోషనల్ డ్రామా 'హైలెస్సో'. ప్రసన్నకుమార్ కోట దర్శకుడు. శివ చెర్రీ, రవికిరణ్ నిర్మాతలు. ప్రముఖ నటుడు శివాజీ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండటం విశేషం. మంగళవారం సుధీర్ పుట్టినరోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రఫ్ లుక్‌లో, గంటలు కట్టిన ఖడ్గాన్ని చేతపట్టుకొని రక్తపు మరకలతో పవర్‌ఫుల్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న సుడిగాలి సుధీర్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బలమైన ఎమోషన్స్ కూడా ఉంటాయని, సుధీర్ ఇప్పటివరకూ చేసిన పాత్రలకు పూర్తిభిన్నమైన పాత్రను ఇందులో పోషిస్తున్నారని, ఇప్పటికే హైదరాబాద్‌లో 25రోజుల షెడ్యూల్ పూర్తయిందని, త్వరలోనే ఏలూరులో 40రోజల భారీ షెడ్యూల్ ప్రారంభం కానున్నదని మేకర్స్ తెలిపారు. నటాషా సింగ్, నక్షా సరన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నటి అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తు న్నది. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, నిర్మాణం: వజ్ర వరాహి. సినిమాస్.

# అభాగ్యులకు అండగా ఐక్య



'నేను సూపర్‌మ్యాన్‌ని కాదు. అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉండను. అందుకే 'ఐక్య ధైర్య సేనా సమితి' అనే సేవా సంస్థను స్థాపించాను. ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలం. పైగా నా కొడుకు పేరు ధైరవ్, బిడ్డ పేరు దేవసేన. వీరిద్దరి పేర్లు కలిసి వచ్చేలా ఈ సంస్థకు ఆ పేరు పెట్టాం. ఇది వాయిస్‌లెస్‌కి వాయిస్‌గా ఉంటుంది' అని హీరో మంచు మనోజ్ అన్నారు. బుధవారం(నేడు) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు మంచు మనోజ్. ఇంకా మాట్లాడుతూ 'జూన్ 7న నా కొత్త సినిమా 'రక్షక్' షూటింగ్ మొదలుకానున్నది. మహిళా సాధికారత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో ఆ సినిమా ఉంటుంది. అందులో నేను డీసీపీగా నటిస్తున్నా. ఆ మూవీ ఓపెనింగ్ రోజున మా 'ఐక్య ధైర్య సేనా సమితి' విధివిధానాలను ప్రకటిస్తా' అని తెలిపారు మంచు మనోజ్. తనకు నటుడిగా పునర్జన్మనిచ్చిన 'మిరాయ్' దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని, 'భైరవం' దర్శకుడు విజయ్ కనకమేడలకు మంచు మనోజ్ కృతజ్ఞతలు తెలిపారు. రకరకాల పాత్రల్ని చేయాలనుకుంటున్నానని, నచ్చిన కథల్ని మాత్రమే చేస్తానని మంచు మనోజ్ చెప్పారు. 'పరస్పరం ఒకరినొకరం గౌరవించుకుంటూ నా భార్య, నేనూ జీవితాలను సాగిస్తున్నాం. వచ్చే ఎన్నికల్లో నా భార్య భూమా నాగమౌనిక పోటీ చేస్తుంది' అని తెలిపారు మనోజ్. తాను నటిస్తున్న 'డేవిడ్ రెడ్డి' షూటింగ్ 40శాతం పూర్తయిందని, ఇవిగాక ఐదారు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని మంచు మనోజ్ తెలిపారు.

# స్పిరిట్‌లో సైలెంట్ వార్?



దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ నిర్మాణం జరుపుకుంటున్న పానిండియా చిత్రాల్లో ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఈ ప్రెస్టేజియస్ మూవీ కోసం అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పూర్తి కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ చూడనటువంటి రూత్‌లెస్ పోలీస్ అవతారంలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన ఎపిసోడ్‌ని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కిస్తున్నట్లు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ ఎపిసోడ్‌లో యాక్షన్ కంటే సైలెన్స్‌తోనే సందీప్ భయపెట్టనున్నారట. ఆద్యంతం సీరియస్ డ్రామాగా ఈ సీక్వెన్స్ సాగుతుందని వినికిడి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య నడిచే వార్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుందట. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న గ్రాండ్‌గా విడుదల కానున్నది.



# వాళ్లంతా మర్యాద లేనివాళ్లే..

## ఆ హీరోలపై కంగనా వ్యాఖ్యలు

%ఖుఅస్త్రుఖు =ఖఖుబ్% ఎ ఏ విషయమైనా కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడటం కంగనా రనౌత్ స్టయిల్. వ్యక్తిగత విషయాలతోపాటు సినీ పరిశ్రమ, దేశంలో జరుగుతున్న ఘటనలపై తరచూ స్పందిస్తుంటుంది. తాజాగా, సినిమా సెట్లలో నటీమణుల పట్ల ఇతరులు వ్యవహరించే తీరుపై కాస్త ఘాటుగానే స్పందించింది. పరిశ్రమలోని చాలామంది నటులు.. హీరోయిన్ల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తారనీ, అలాంటి అనుభవాలు తనకూ ఇబ్బంది కలిగించాయని చెప్పుకొచ్చింది. తాజాగా, ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నేను ఎక్కువమంది హీరోలతో పని చేయలేదు. కానీ, నేను పనిచేసిన వాళ్లలో చాలామంది 'మర్యాద తెలియని' వాళ్లే!" అంటూ మండిపడింది కంగనా. అయితే, ఇది కేవలం లైంగిక వేధింపుల గురించి మాత్రమే కాదనీ.. సెట్‌కు ఆలస్యంగా రావడం, మర్యాదగా ప్రవర్తించకపోవడం, హీరోయిన్లను కించపరచడం, వారికి చిన్న కారావ్యాన్ ఇవ్వడం.. ఇలాంటివన్నీ మర్యాదలేని వ్యవహారాలేనని కంగనా అభిప్రాయ డింది. "వీటన్నిటినీ నేను చాలా వ్యతిరేకించేదాన్ని. దానివల్ల చాలా ఇబ్బందులు పడ్డాను. కేసులు కూడా ఎదుర్కొన్నాను" అంటూ చెప్పుకొచ్చింది. చాలామంది అమ్మాయిలు సర్దుకుపోయినా.. తను మాత్రం అలా ఉండలేకపోయేదట. అందుకే.. తనకు అహంకారమని అందరూ అనుకునేవారంటూ కంగనా ఆవేదన వ్యక్తంచేసింది. ఆమె కెరీర్ విషయానికి వస్తే.. 2006లో వచ్చిన గ్యాంగ్‌స్టర్ సినిమాతో బాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత వో లమ్హే, లైఫ్ ఇన్ ఎ మెట్రో లాంటి సినిమాలతో మెప్పించింది. 'ఫ్యాషన్' సినిమాతో ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నది. ఈ సినిమాకు 2008లో ఉత్తమ సహాయ నటిగా జాతీయ అవార్డునూ అందుకున్నది. క్వీన్, తను వెడ్స్ మను రిటర్న్స్ చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది.